క్లుప్తంగా

మొక్కలు ఎండకుండా చర్యలు



వెల్దండ: మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏపీఓ ఈశ్వర్‌జీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చెదురుపల్లి, గుండాల తదితర గ్రామాల్లోని నర్సరీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో ఇచ్చిన టార్గెట్ ప్రకారం మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. వేసవికాలం కావడంతో గ్రీన్ నెట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి రోజు మొక్కలకు సక్రమంగా నీరు పోయాలని కోరారు. అనంతరం ఉపాధి హమీ పనులను పరిశీలించారు. ఉదయం 6 గంటల నుంచి 12గంటల వరకు పనులు ముగించాలని సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

ఎస్సీలకే మండల అధ్యక్ష పదవి ఇవ్వాలి

వెల్దండ: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవి ఎస్సీలకే ఇవ్వాలని మాదిగ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు మీసాల అంజయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో మాదిగ జనాభా ఎక్కువగా ఉన్నప్పటికి నేటికి కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎస్సీలకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపుగా పార్టీ కోసం తాను 35 ఏళ్లుగా పని చేస్తున్నానని మండల అధ్యక్ష పదవికి అన్ని అర్హతలు ఉన్నాయని వివరించారు. కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

దేవాలయ భూములు కాపాడాలని వినతి

కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేట గ్రామపంచాయతీ పరిధిలో రామగిరిలో వెలసిన అతిపురాతనమైన శ్రీరామచంద్ర స్వామి దేవాలయ భూములను కాపాడాలని బీజేపీ ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యాలయంలో మంగళవారం అడిషనల్ కమిషనర్ కృష్ణవేణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగిరి దేవాలయానికి 540 ఎకరాల భూమి ఉందని అందులో 100 ఎకరాలకు పైగా గుట్ట ఉండటంతో ఆ గుట్టను కొంతమంది కాంట్రాక్టర్లు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని వివరించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, మండల అధ్యక్షుడు నరేష్ గౌడ్, నరసింహ, శ్యాంసుందర్, మల్లికార్జున రెడ్డి, వినయ్‌రెడ్డి, రమేష్, సైదులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో చలివేంద్రం, అంబలి కేంద్రాన్ని మంగళవారం మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్ ప్రారంభించారు. దండు నర్సింహ, వెంకటేశ్వర్‌రెడ్డి, చిన్నయ్య, రవికుమార్, మల్లయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

ఒక వర్గం ఓట్ల కోసమే అసత్య ప్రచారం

కల్వకుర్తి రూరల్: ఒక వర్గం ఓట్ల కోసమే మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. వక్ఫ్ బోర్డు సమస్యను పక్కదోవ పట్టించడానికే బీజేపీ పహల్గామ్ ఉగ్రవాదుల దాడిని తెరపైకి తెచ్చిందని మాజీ సర్పంచ్ అనడం సిగ్గుచేటన్నారు. రెచ్చగొట్టె వ్యాఖ్యలు మానుకోకపోతే ఊరుకోమని హెచ్చరించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు నరసింహ, పట్టణ అధ్యక్షుడు బాబీ దేవ్, మండల అధ్యక్షుడు మట్ట నరేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ జాతర విజయవంతం చేయాలి



కల్వకుర్తి రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో 14న నిర్వహించే బీఆర్ అంబేడ్కర్ జాతరను విజయవంతం చేయాలని అంబేడ్కర్ జాతర కమిటీ జిల్లా అధ్యక్షుడు గడ్డం విజయ్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జాతర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న 80% ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ఇప్పటివరకు రాజ్యాధికారం లేదన్నారు. అగ్రకులాల చేతిలో బానిసలుగా జీవనం సాగిస్తూ ఆర్థిక, రాజకీయ, సామాజిక వివక్షకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం జాతరకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో కల్వకుర్తి ఇన్‌చార్జ్‌గా బాల చంద్రయ్య, కో ఇన్‌చార్జ్‌గా కాశన్నలను నియమించారు. బాలస్వామి, శివ శంకర్, శ్రీనివాస్, శ్రీశైలం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



పెంట్లవెల్లి చౌట చెరువు దగ్గర ప్రమాదకరంగా మలుపు



మల్లేశ్వరం వెళ్లే ప్రధాన రహదారిపై ..

ప్రమాదకరంగా మలుపులు

పెంట్లవెల్లి మండల కేంద్రంతో పాటు గోప్లాపురం, మంచాలకట్ట, మల్లేశ్వరం, కొండూరు, తడకలతండాలకు వెళ్లే ప్రధాన రహదారులపై ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడకపోవడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. పలు గ్రామాల నుంచి నిత్యం మండల కేంద్రానికి వివిధ గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తారు. అంతేకాకుండా రోడ్డుకు ఇరుపక్కల కంపచెట్లు ఏపుగా పెరగడంతో ప్రమాదాలకు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. యువకులు కిందపడి గాయాలైన ఘటనలు ఎన్నో ఉన్నాయని పలువురు తెలిపారు. మలుపుల వద్ద సూచికబోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – పెంట్లవెల్లి

సంప్రదించాల్సిన అధికారి ఆర్‌అండ్‌బీ ఏఈ రవి, సెల్: 9870170492

నామమాత్రంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

లింగాల: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పథకం పనులలో అక్రమాలు చోటు చేసుకుంటున్నా తనిఖీలలో అధికారులు అక్రమాలను కప్పి పుచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 15వ విడత ఉపాధి పనుల సామాజిక తనిఖీల ప్రజావేదిక తూతూ మంత్రంగానే కొనసాగింది. మండలంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు 23 గ్రామ పంచాయతీలలో ఏడాది కాలంలో రూ. 2.47 కోట్ల పైగా నిధులను ఖర్చు చేశారు. రాత్రి 8 గంటల సమయం వరకు 16 గ్రామ పంచాయతీల సంబంధించి నివేదికలను పరిశీలించిన అధికారులు మరో 7 గ్రామ పంచాయతీల నివేదికలను పరిశీలించాల్సి ఉంది. రికవరి వివరాలు, బాధ్యులపై చర్యల వివరాలు తెలియాల్సి ఉంది. హరితహారంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ విషయంలో తప్పుడు లెక్కలు చూపడం, మస్టర్లలో బినామీ పేర్లు ఉండడం, పనులలో ఖచ్చితమైన లెక్కలను చూపక పోవడం, పనులకు సంబంధించిన రికార్డులను పలువురు ఎఫ్ఏలు తనఖీ బృందాలకు చూపక పోవడం తదితర అక్రమాలు వెలుగు చూశాయి. మండల స్థాయిలో ఉపాధి పనులపై పూర్తి స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో అక్రమాలకు అంతేలేకుండా పోతుంది. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరీ, క్లస్టర్ ఏపీడీ శ్రీనివాస్, ఎంపీడీఓలు చంద్రశేఖర్, ఆంజినేయులు, ఏపీఓ ఇమాంఅలీ, ఎస్ఆర్పీ గంగరాజు, డీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, తనిఖీ బృందాలు పాల్గొన్నాయి.



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

అన్నదాతల ఆందోళన



కల్వకుర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిర్లక్ష్యం వహించడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కల్వకుర్తి ప్రాంతంలో రెండు మిల్లులకే ధాన్యం కేటాయించడంతో రైతులకు సమస్యలు తలెత్తున్నాయని వాపోయారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం అలసత్వం వహించడంతో మంగళవారం రైతు సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో రాస్తారోకో చేశారు. రోడ్డుపై ధాన్యం పోసి నిప్పు అంటించేందుకు యత్నించారు. రైస్ మిల్లుల వద్ద తరుగు పేరుతో క్వింటాల్ కు పది నుంచి 12 కేజీల తరుగును తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ మాధవరెడ్డి సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని రైతులను శాంతింపజేశారు. అనంతరం రైతు సేవా సమితి నియోజకవర్గ అధ్యక్షుడు పసుల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయంలో హరిందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు బండేల రామచంద్ర రెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాస్ రెడ్డి, రామ్ రెడ్డి, రామస్వామి తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని ఉపాధి హమీ ఉద్యోగులు మంగళవారం అదనపు కలెక్టర్ దేవసహాయానికి వినతిపత్రం అందించారు. డీఆర్‌డీఓ చిన్న ఓబులేశ్, జేఏసీ చైర్మన్ బాలయ్య, ఏపీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీలు ఉన్నారు.

భగవద్గీత శ్లోకాల పఠనం



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో భగవద్గీత శ్లోకాల పఠనంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలు నేర్పించాలని నిర్వాహకులు సూచించారు. ఆలయ చైర్మన్ కల్వ మనోహర్, నిర్వాహకులు ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



తాడూరు: మండల కేంద్రంలోని 11, 12వ వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మంగళవారం కాలనీవాసులు అధికారులకు విన్నవించారు. పైపులైన్ మరమ్మతుకు నోచుకోవడంతో తాగునీరు సరఫరా చేయడం లేదని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శితో పాటు అర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా



పెద్దకొత్తపల్లి: దేవనితిర్మలాపూర్ బీసీ కాలనీలో వాటర్ ట్యాంక్ వెళ్లే మిషన్ భగీరథ పైపులైను పగిలింది. దీంతో నీరు ఎగిసిపడుతూ వృథాగా పోతోంది. దీంతో బీసీ కాలనీ ప్రజలకు తాగునీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకొని పగిలిన పైపులైన్‌కు మరమ్మతు చేయాలని కాలనీవాసలు కోరుతున్నారు.

సామ జగన్మోహన్‌రెడ్డికి నివాళి

కందనూలు: రాడికల్స్‌ను ఎదురించిన యోధుడు సామ జగన్మోహన్‌రెడ్డి అని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగారుబాబు అన్నారు. ఏబీవీపి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శిశుమందిర్ పాఠశాలలో మంగళవారం సామ జగన్మోహన్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశభక్తుల హృదయాలలో చిరస్థాయిలో నిలిచాడన్నారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ప్రసాద్ కుమార్, సంయుక్త కార్యదర్శి శివ, మల్లేష్ యాదవ్, శారద శివ, శ్రీకాంత్, రమేష్, మహేష్, వెంకటేష్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.



గోడలను తొలగించాలని ధర్నా



నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని 17వ వార్డు బీసీ కాలనీ, సాయినగర్ కాలనీవాసులకు రాకపోకలకు అడ్డుగా ఉన్న గోడలను తొలగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం రహదారికి అడ్డంగా ఉన్న గోడ దగ్గర ఆయా కాలనీవాసులు బీసీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి మధు, భరత్, పర్వతాలు, నర్సింహ, వెంకటేష్, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జేకే మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరవుతారని పేర్కొన్నారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దేవాలయ భూమి సాగుకు వేలం

బల్మూర్: మండలంలోని వీరంరాజుపల్లి గ్రామ వీరాంజనేయస్వామి దేవాలయానికి చెందిన మాన్యం భూమి సాగు కోసం దేవాదాయ శాఖ అధికారులు వేలం పాట నిర్వహించినట్లు ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు ఎం .వెంకటయ్య మంగళవారం తెలిపారు. సర్వే నంబర్లు 23, 137లలో గల 21ఎకరాల 20గుంటల భూమికి గాను గ్రామానికి చెందిన రైతులు సంవత్సరానికి ఎకరాకు రూ.6800 చొప్పున చెల్లించేందుకు వేలం పాడినట్లు పేర్కొన్నారు. వేలం కాల పరిమితి 2025 మే 1వ తేదీ నుంచి 2026 ఏప్రిల్ 30 వరకు ఉంటుందని వివరించారు.

విద్యార్థుల యూనిఫాం మెటీరియల్ పంపిణీ




చారకొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అవసరమైన ఏకరూప దుస్తులకు సంబంధించిన మెటీరియల్‌ను మంగళవారం మండలంలోని ఎంఆర్సీ కార్యాలయంలో మండల విద్యాధికారి ఝాన్సీరాణి ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు దుస్తులను కుట్టేందుకు అప్పగించిందని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీ యాదయ్య తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపురంలో కాంగ్రెస్ కార్యకర్త ఎరుకలి పెద్దసుంకన్న మూడు రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తాడూరు భాస్కర్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.15 వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు మేకల గోపాల్‌యాదవ్, వెంకటనర్సింహరెడ్డి, సత్యానారాయణగౌడ్, కృష్ణయ్య, వెంకటస్వామి, నర్సింహ, ఎల్లయ్య, సుంకన్నలు పాల్గొన్నారు.

మైనింగ్ అనుమతులు నిలిపివేయాలి



చారకొండ: సిర్సనగండ్ల గ్రామంలో బ్లాక్ గ్రానైట్ తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని గ్రామస్తులు, యువకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. మైనింగ్ తవ్వకాలతో గ్రామంలో పంటపొలాలు దెబ్బతింటాయని వివరించారు. అనుమతులు రద్దు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని తెలిపారు. కృష్ణయ్య, రామచంద్రయ్య, బుచ్చమ్మ, బక్కమ్మ, సురేష్, యువకులు తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అచ్చంపేట రూరల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. అచ్చంపేట నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, ఐటీడీఏ పరిధిలో మరో వెయ్యి ఇళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం బొడ్రాయి పండుగ ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

చారకొండ: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంతో పాటు, సిర్సనగండ్ల, తిమ్మాయిపల్లి, అగ్రహారం తండా, సారంబండ తండా, తుర్కలపల్లి, కమాల్‌పూర్ శాంతి గూడెం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ 20, కల్యాణలక్ష్మి 8 చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, నాయకులు మాజీ జెడ్పీటీసీ వెంకట్‌గౌడ్, నాయకులు మహేందర్ వెంకటయ్య గౌడ్, సహదేవ్, ప్రశాంత్ నాయక్, బిందాస్ తదితరులు ఉన్నారు.



అచ్చంపేటలో లబ్ధిదారురాలికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాపై రీ సర్వే

సాక్షి, నెట్‌వర్క్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇదివరకే నిర్వహించిన లబ్ధిదారుల ఎంపికపై మంగళవారం అధికారులు రీసర్వే నిర్వహించారు.

■ చారకొండ మండలంలో చంద్రాయన్‌పల్లిలో మంగళవారం ఎంపీఓ వెంకటేష్ ఇంటింటికి తిరిగి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో 35 ఇళ్ల మంజూరు అయినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు.

■ ఊర్కొండ మండలంలోని మాదారంలో 42 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశారు. రేవెల్లిలో 14 మంది, తిమ్మన్న పల్లిలో 8 మంది, ఇప్పపాహడ్ గ్రామంలో 13 మంది, ఊర్కొండ పేటలో 24 మందిని ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో ఎంపీడీఓ కృష్ణయ్య పర్యటించి లబ్ధిదారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, పీఆర్ఏఈ మహేందర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



ఊర్కొండలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేస్తున్న అధికారులు

■ తాడూరు మండల కేంద్రంతోపాటు పాపగల్, సిర్సవాడ, ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల రిసర్వేను మంగళవారం ఎంపీడీఓ అంజనేయులు, పాపగల్‌లో ఎంపీఓ నర్సింహులు పరిశీలించారు. పీఆర్ ఏఈ శివకృష్ణ, కార్యదర్శులు వీరయ్య, పవన్‌కుమార్, శుభాకర్, మాజీ ఎంపీటీసీ రమేష్, గ్రామస్తులు లింగం, ప్రతాప్‌రెడ్డి, రజియా బేగం పాల్గొన్నారు.

■ కోడేరు మండల కేంద్రంలో ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రవితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



బావాజిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహిళా సంఘం సభ్యురాలు

తిమ్మాజిపేట: మండలంలోని బావాజిపల్లి మహిళా సంఘం సభ్యురాలు, కోడుపర్తిలో ఏపీఎం బాలస్వామి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, మహిళా సంఘం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గోవిందాయపల్లిలో ..

తాడూరు: మండలంలోని గోవిందాయపల్లిలో మంగళవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం బాల్‌చంద్రయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులతోపాటు, రైతులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని నక్కపల్లి చంద్రకల్, చెన్నపురావుపల్లి, గంట్రావ్‌పల్లి గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం అరుణ, వెంకటేశ్వర్లు, నర్సింహ, రవికుమార్, సత్యం, విష్ణువర్ధన్‌రెడ్డి, రాంచంద్రయ్య, మల్లేష్, శిరిష పాల్గొన్నారు.

పర్యావరణ అనుమతులపై ప్రజాభిప్రాయ సేకరణ

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల శివారులో సర్వే నం.182 లో బ్లాక్ గ్రానైట్ అనుమతులపై మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను నాయక్, పర్యావరణ కాల్యుష్య నియంత్రణ మండలి ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, తహసీల్దార్ సునీత హాజరయ్యారు. గ్రామ శివారుల్లో సర్వే నంబర్ 182లో 7.7 హెక్టర్లలో బ్లాక్ గ్రానైట్ అనుమతులు ఉన్నాయని అధికారుల తెలిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నూతన టెక్నాలజీ, పరికరాలతో పనులు చేపడతారని, పరిసర గ్రామాల్లో తాగేందుకు ఆర్ఓ ప్లాంట్‌ల ద్వారా శుద్ధ జలాలు వసతి కల్పించాలని, స్థానికులకు ఉపాధి, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఆర్డీఓ శ్రీనునాయక్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను ఉన్నత అధికారులకు నివేదిస్తామన్నారు. సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఐ శంషోద్దిన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ భరత్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనునాయక్

బీఆర్ఎస్ సభ విజయవంతంపై హర్షం

సాక్షి, నెట్‌వర్క్: వరంగల్ జిల్లాలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు తరలివచ్చి సభను విజయవంతం చేయడంపై బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీశైలం, బిజినేపల్లిలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి, తిమ్మాజిపేటలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోపి గౌడ్‌లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించిన రజతోత్సవ సభకు తరలిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



బిజినేపల్లిలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

నేటి నుంచి బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం

అచ్చంపేట: పట్టణంలో ఈనెల 30 నుంచి మే 4న ఆదివారం వరకు గ్రామ బొడ్రాయి, గ్రామ దేవత పోచమ్మ అమ్మ వారి ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. 30న బుధవారం ఉదయం 10.53 గంటలకు జగదుర్గు శంకరాచార్య శ్రీవిద్యారణ్య భారతిస్వామి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. సాయంత్రం 4 గంటలకు గ్రామబొడ్రాయికి భ్రమరాంబ అమ్మవారి దేవస్థానంలో పూర్ణకుంభాలతో ప్రత్యేక అభిషేకం, మంగళహారతి నిర్వహించనున్నారు. మే 1న ఉదయం 8 గంటలకు బొడ్రాయి, పోచమ్మ అమ్మవార్ల విగ్రహాల ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. 2న గోపూజ, యాగశాల ద్వార తోరణ పూజలు, సామూహిక కుంకుమార్చనలు, 3న యాగశాలలో యాగ మండప దేవతార్చనలు, ప్రధాన ప్రతిష్ఠ హోమాలతో మహా మృత్యుంజయ, చండీ సహిత అష్టదిక్పాలక మాతృ దేవత ప్రధాన హోమాలు నిర్వహించనున్నారు. 4న ఆదివారం ప్రత్యేక ప్రతిష్ఠ హోమాలతో మహా పూర్ణాహుతి, ఉదయం10.08గంటలకు వేదపండితులతో బొడ్రాయి, పోచమ్మ అమ్మవార్ల యంత్రబింబ విగ్రహ ప్రతిష్ఠించనున్నారు. సాయంత్రం 6 గంటలకు బోనాల సమర్పన ఉంటుందని వివరించారు.

ట్రాఫిక్ ఆంక్షలు

అచ్చంపేట రూరల్: పట్టణంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవం సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ స్టేడియం, ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్, నాగర్‌కర్నూల్ రోడ్డులోని ఎస్‌బీఐ వెనకాల గ్రౌండ్, మార్కెట్‌యార్డు, పాతబస్టాండు గ్రౌండ్, లింగాల రోడ్డులోని బీకే ఫంక్షన్ హాలు రోడ్డు స్థలాలను పార్కింగ్‌లకు వాడుకోవాలని సూచించారు. ఇరుకు రోడ్లపై వాహనాలు నిలుపొద్దన్నారు.